# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజస్థాన్ లోని బికనీర్ నుంచి 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు జాతికి అంకితం చేశారు.**
2. **ప్రజల అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధ్యానతనిస్తోదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**
3. **ప్రజా సమస్యల పరిష్కారానికి 'మన ఊరు-మాటా మంతి' కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ఈరోజు ప్రారంభించారు.**
4. **రైతుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.**
5. **కూటమి ప్రభుత్వం 12 నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అమలు కాలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.**

==========================

అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన 103 అమృత్ భారత్ స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు జాతికి అంకితం చేశారు. ప్రారంభించారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వేస్టేషన్లతో పాటు రాష్ట్రంలోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట అమృత్ భారత్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం ఆయన రాజస్థాన్‌లోని బికనీర్‌లో 26 వేల కోట్ల రూపాయలతో చేపట్టే మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..27 సెకన్లు

అంతకుముందు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల ప్రారంభం ద్వారా నూతన శకం ప్రారంభమైందని అన్నారు. గడచిన కొన్నేళ్ళల్లో రైల్వే శాఖలో అనేక నూతన సంస్కరణలు చేపట్టామని తెలిపారు.

------------------------

కాగా.. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో

కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధ్యానతనిస్తోందని అన్నారు.

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి 'మన ఊరు–మాటా మంతి' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. సినిమా తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా గుంటూరు జిల్లా మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలస గ్రామస్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని టెక్కలిలోని ఒక సినిమా థియేటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...

..వాయిస్...31 సెకన్లు

---------------------------

రైతుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఖరీఫ్ పంటల సంసిద్ధతపై అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆహార పంటలతో పాటు ఉద్యాన, వాణిజ్య పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో అధిక దిగుబడులు, మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు నూతన సాంకేతికతను, కృత్రిమ మేధను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు, సకాలంలో రైతులకు అందే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

రేషన్ పంపిణీలో లబ్దిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా తెనాలిలోని క్యాంపు కార్యాలయం నుండి ఆయన జిల్లాల సంయుక్త కలెక్టర్లు పౌరసరఫరాల శాఖ అధికారులతో నిన్న దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ పంపిణీని చౌక ధరల దుకాణాల ద్వారా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల వద్ద ఏర్పాట్లు చేయాలని సూచించారు.

---------------------------

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా, భారత సైనికుల పరాక్రమానికి దేశం గౌరవ వందనం తెలుపుతోంది. సాయుధ దళాలకు సంఘీభావంగా, ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇందులో భాగంగా భారత్–పాక్ యుద్ధంలో అత్యున్నత త్యాగం చేసిన పరమ వీర చక్ర సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేత్రపాల్‌ను గురించి ఈ రోజు తెలుసుకుందాం.

వాయిస్ .. 39 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ 12 నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అమలు కాలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్ర రెవెన్యూలో 3.8 శాతం మాత్రమే పెరుగుదల కనిపించిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

---------------------------

యోగా సాధన ద్వారా ఆరోగ్యకరమైన సమాజం ఆవిష్కృతమవుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు తెలిపారు. నరసరావుపేటలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో యోగను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా విశిష్టతను తెలిపేలా జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ జీవ వైవిధ్య అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. భూమిపె ఉన్న జీవాల మధ్య భేదాన్నే జీవ వైవిధ్యం అంటారు. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదం చేసే లక్షలాది జంతు జాతులు, వృక్ష జాతులు, నీటి వనరులు ఈ రోజు అంతరించి పోయే దశకు చేరుకున్నాయి. వీటిని పరిరక్షించడం ద్వారా మనం వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు.

కాగా.. ఈరోజు రాష్ట్ర జీవ వైవిధ్య బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పరిశీలించారు.

---------------------------

బాపట్ల జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో పని చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. బాపట్లలో జరిగిన జిల్లా అభివృద్ధి మండలి సమీక్ష సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని, వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 1.07 లక్షల ఎకరాలకు సాగునీరందించే 94 ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, అసంపూర్తి పథకాల నిర్మాణం పూర్తి చేయటానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఈనెల 19వ తేదీ నాటికి 257 కరోనా కేసులు నమోదయ్యాయని రాష్ట్రంలో ఇప్పటి వరకు కేసులు నమోదు కాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. జ్వరం, దగ్గు జలుబు గొంతు నొప్పి లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించింది.

=====================